క్లుప్తంగా

ఖాతాదారుల సహకారంతో బ్యాంకు అభివృద్ధి

తంబళ్లపల్లె : మండల కేంద్రంలోని సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఖాతాదారుల సహకారంతోనే ఏడాదిలో అభివృద్ధిలో నడుస్తున్నట్లు బ్యాంకు చైర్మన్ ప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలోని ములకలచెరువు రోడ్డులో శనివారం నూతన బ్యాంకు భవనాన్ని ఆయన ప్రారంభించారు. బ్యాంకు ప్రారంభించి ఏడాదిలోనే రూ.10.08 కోట్ల టర్నవర్ జరిగేందుకు ఖాతాదారుల సహకరమే కీలకమన్నారు. కార్యక్రమంలో జీఎం ప్రభాహరన్, ఆర్ఎం ప్రసాద్, మేనేజర్ మోహన్, క్యాషియర్ చరిత పాల్గొన్నారు.

వాల్మీకిపురం ఈఓగా రెడ్డి ప్రసాద్‌రెడ్డి



వాల్మీకిపురం : వాల్మీకిపురం మేజర్ పంచాయతీ ఈవోగా రెడ్డి ప్రసాద్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. పీలేరు ఈవోగా పని చేస్తున్న రెడ్డి ప్రసాద్ రెడ్డి వాల్మీకిపురం ఈవోగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేజర్ పంచాయతీలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడంతో పాటు పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు.

యునిసెఫ్ రాష్ట్ర స్థాయి వర్క్ షాప్‌కు ఎంపిక

వాల్మీకిపురం : ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా ఎస్‌సీఈఆర్‌టీ వారి యునిసెఫ్ సహాయంతో విజయవాడ సాల్ట్ ఆఫీస్‌లో ఈ నెల 22న నిర్వహించబోయే రాష్ట్ర స్థాయి వర్క్ షాప్‌కి వాల్మీకిపురం పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయులు రవీంద్ర రెడ్డి ఎంపికయ్యారు. ఇందులో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో భాగంగా ప్రాణాధారమైన నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య, సేవలు, ఆరోగ్యం, అభ్యాసం, గౌరవాన్ని విద్యార్థులకు అందించడం , పలు అంశాలపై చర్చించనున్నారు.

శ్రీరామ పూజిత అక్షింతలు పంపిణీ

కేవీపల్లె : మండలంలోని కేవీపల్లె, గర్నిమిట్ట, మోటుపల్లెవాండ్లపల్లె గ్రామ పంచాయతీల పరిధిలో పలు గ్రామాల్లో శ్రీరామపూజిత అక్షింతలు పంపిణీ చేశారు. ఆయోధ్య శ్రీరామజన్మ భూమిలో విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకుని శ్రీరామ పూజిత పాద పవిత్ర అక్షింతలు భక్తులకు అందజేశారు.

సురక్షిత ప్రయాణమే ధ్యేయం



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎంఈ నాగేశ్వరరావు

మదనపల్లె సిటీ : ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమని, డ్రైవర్లు జాగ్రత్తగా వాహనాలు నడపాలని ఆర్టీసీ డిప్యూటీ సీఎంఈ నాగేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక మదనపల్లె వన్ డిపో గ్యారేజీలో వన్,టు డిపోల సిబ్బందితో రోడ్డు భద్రతా మాసోత్సవాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్లు మూరే వెంకటరమణారెడ్డి, ఆర్‌సి నిరంజన్, ఆర్టీసీ సీఐ రేవతి, టు టౌన్ ఎస్.ఐ వెంకటసుబ్బయ్య, వీఎస్ఆర్ గ్రాండ్ సుధాకర్‌రెడ్డి, మోటివేటర్ రామమూర్తి పాల్గొన్నారు.

నాటక ప్రదర్శనను విజయవంతం చేయాలి

రామసముద్రం : మండల కేంద్రంలోని గుంతలపేట గ్రామంలో వెలసిన శ్రీఆంజనేయస్వామి ఆలయం వద్ద ఈనెల 25న జరిగే శ్రీ మహాభారత అభినయ నాటకం ప్రదర్శనను విజయవంతం చేయాలని టీటీడీ ఆస్థాన భగవతారిని చంద్రశేఖర్, టిటీటీ విశ్రాంత ఉద్యోగి టి.నారాయణ, సీనియర్ కళాకారుడు నాగప్ప తెలిపారు.

వైఎస్సార్ క్లినిక్ తనిఖీ

ములకలచెరువు : మండలంలోని సోంపల్లి వైఎస్సార్ క్లినిక్ ను ఎంపీడీఓ పోలప్ప శనివారం ఆగస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది పనితీరుపై ఆరాతీశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం క్లినిక్‌కు వచ్చిన రోగులతో మాట్లాడారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, అధికారులు ఆయనతో ఉన్నారు.

108 వాహనంలో ప్రసవం

కేవీపల్లె : మండలంలోని నూతనకాల్వ పంచాయతీ గుట్టలపై నడింపల్లెకు చెందిన మల్లికార్జున భార్య జోత జయమ్మకు శనివారం రాత్రి పురిటినొప్పులు రావడంతో 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. 108 వాహనం గ్రామానికి చేరుకుని జయమ్మను పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించడానికి బయలు దేరారు. అయితే మార్గం మధ్యలో నూతనకాల్వ సమీపంలో 108 వాహనంలోనే జయమ్మ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారు.

జింక పిల్లను కాపాడిన వెల్ఫేర్ అసిస్టెంట్

పెద్దతిప్పసముద్రం: కందుకూరు సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేసే మధు కుక్కల బారి నుంచి ఓ జింక పిల్ల కాపాడారు. శనివారం తిమ్మిరెడ్డిపల్లి క్రాస్ వద్ద అటవీ ప్రాంతం నుంచి తప్పిపోయిన జింక పిల్లను కుక్కలు వెంటపడగా చూసిన మధు వాటి నుంచి జింక పిల్లను కాపాడారు. అనంతరం అటవీ శాఖ బీట్ అధికారి హనుమంత్‌రావ్‌కు అప్పగించారు.

అభివృద్ధి చేశాం.. ఆశీర్వదించండి

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



లబ్ధిదారురాలికి సంక్షేమ బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ఎంతో అభివృద్ధి చేశాం... వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం పీలేరు పట్టణంలోని బండ్లవంక, సైనిక్ నగర్, కడప రోడ్డు ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు గూర్చి వివరించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు నాయుడు తన కుటుంబ అభివృద్ధి చేసుకున్నారు, తప్ప రాష్ట్ర ప్రజల అభివృద్ధి గూర్చి విస్మరించారని తెలిపారు. గతంలో 650 హామీలు గుప్పించి అమలు చేసింది శూన్యమని పేర్కొన్నారు. మరోసారి ఎన్నికలు దగ్గర పడడంతో ఇష్టాను సారం ప్రజలను మభ్యపెట్టే విధంగా హామీలు గుప్పిస్తున్నారని తెలిపారు. ప్రజలు ఆయన మాటలు నమ్మి మోసపోరాదన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు యదావిధిగా కొనసాగాలంటే వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజల నుంచి వచ్చిన వివిధ సమస్యలు అప్పటికప్పుడే సంబంధిత అధికారులకు తెలియజేసి పరిష్కరించాలని సూచించారు.

కలికిరిలో దళితులపై దాడి హేయమైన చర్య : కలికిరి టీడీపీ నాయకులు దళితులపై దాడి చేయడం హేయమైన చర్యగా ఎమ్మెల్యే అభివర్ణించారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి అండతో ఆయన అనుచరులు దళిత భూములను ఆక్రమించుకునే క్రమంలో వారిపై దాడి చేయడం క్షేమించరాని నేరమన్నారు. రాష్ట్రంలో అంబేడ్కర్ ఆశయాలైన మహిళ సాధికారిత, విద్య, అభివృద్ధి, అన్ని రంగాల్లోనూ ఎస్సీ, ఎస్టీలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి అభివృద్ధి చేస్తున్న తరుణంలో టీడీపీ నాయకులు ఇలాంటి దారుణాలకు పాల్పడడం బాధాకరమన్నారు. దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, జి.వి. రాకేష్‌రెడ్డి, ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి, సర్పంచ్ జీనత్‌షఫీ, నాయకులు దండు జగన్‌మోహన్‌రెడ్డి, డాక్టర్ హబీబ్‌బాషా, ఎస్.వి. చలపతి, నాగభూషణం, కాటయ్య, మల్లి, మహితా ఆనంద్, ఉదయ్‌కుమార్, నరసింహారెడ్డి, చక్రధర్, కృష్ణారెడ్డి, సురేంద్ర రెడ్డి, సఫూరా, రాజేశ్వరి, రాజలక్ష్మి, ప్రభావతి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

దళితుల జోలికొస్తే సహించేది లేదు

టీడీపీ నేతలకు దళిత సంఘాల నేతలు హెచ్చరిక



పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు, మాలమహానాడు నేతలు

కలికిరి : దళితుల జోలికి వస్తే సహించేది లేదని మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు యామలా సుదర్శనం హెచ్చరించారు. టీడీపీ నాయకుడు కిశోర్ కుమార్ రెడ్డి ప్రధాన అనుచరుడైన అవినాష్ రెడ్డి అతని అండతో దళితుల భూములు ఆక్రమించుకుని, అడ్డువచ్చిన వారిపై దాడులకు తెగబడుతున్నారన్నారు. కలికిరిలో జరిగిన దళితులపై దాడి ఘటనకు సంబంధించి నిందితులు అవినాష్‌రెడ్డి, అతని అనుచరులపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేయకపోవడంతో శనివారం బాధితులతో కలిసి కలికిరి గాంధీ కూడలి వద్ద ధర్నా నిర్వహించి, అక్కడి నుంచి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా వచ్చి నిరసన తెలియచేశారు. ఈ సందర్భంగా యామలా సుదర్శనం మాట్లాడుతూ దళితులపై దాడులకు పాల్పడిన వారు ఎంతటి వారైనా వారిపై కఠిన చర్యలు తీసుకునే వరకు పోరాటం చేస్తామన్నారు. నియోజకవర్గంలో టీడీపీ గూండాలు దళితులు, మహిళలపై పైశాచికంగా దాడులకు తెగించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగ నిర్మాన డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కల్పించిన ఓటు హక్కుతో దళితులు టీడీపీ తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. మైనార్టీ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఐ హనీఫ్ వీరికి మద్దతిచ్చి నిరసనలో పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలకు తాము అండగా ఉంటామన్నారు. దళిత సంఘాల నిరసన సమాచారం పోలీసులు ఉన్నతాధికారులకు తెలియచేయడంతో స్పందించిన ఎస్సీ, ఎస్టీ సెల్ మదనపల్లి డీఎస్పీ సుధాకర్ కలికిరికి చేరుకుని నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. కార్యక్రమంలో మాలమహానాడు సంఘం రాయలసీమ గౌరవాధ్యక్షుడు ఎస్టీడి హరి, రాష్ట్ర కార్యదర్శి పుంగనూరు అశోక్, జిల్లా అధ్యక్షుడు శివకుమార్, జిల్లా నాయకులు మల్లెల మోహన్, గూండా మనోహర్, సురేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

26న వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

- ఎన్నికల దిశగా కార్యాచరణపై సమాయత్తం
- కార్యకర్తల సంక్షేమానికి ప్రాధాన్యత
- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్



వైఎస్సార్ సీపీ నాయకులతో చర్చిస్తున్న సమన్వయకర్త నిసార్‌అహ్మద్

మదనపల్లె : నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం జనవరి 26న జరుగుతుందని, ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ కోరారు. శనివారం కార్యకర్తల సమావేశం విజయవంతంపై మాజీ ఎమ్మెల్సీ నరేషకుమార్‌రెడ్డి ఇంట్లో వైఎస్సార్ సీపీ కీలకనేతలు సమావేశమయ్యారు. సార్వత్రిక ఎన్నికలు-2024కు సంబంధించి త్వరలో షెడ్యూల్ వెలువడనున్న నేపథ్యంలో ఎన్నికలకు క్యాడర్‌ను సమాయత్తపరిచి, కార్యోన్ముఖులను చేసే దిశగా సమావేశంలో చర్చించడం జరుగుతుందన్నారు. వైఎస్సార్ సీపీ లోక్‌సభపక్షనేత, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై, 2024లో వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చి సీఎం జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా కార్యాచరణ ప్రకటిస్తారన్నారు. నియోజకవర్గ నూతన సమన్వయకర్తగా నియమితులైన నిసార్‌అహ్మద్‌ను క్యాడర్‌కు పరిచయం చేయడం, పార్టీ గెలుపుకు అనుసరించాల్సిన వ్యూహ, ప్రతివ్యూహాలపై మార్గనిర్దేశనం చేస్తారన్నారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించతలపెట్టిన సమావేశానికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం హాజరవుతారని, నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్ జింకావెంకటాచలపతి, మార్కెట్‌కమిటీ చైర్మన్ తట్టిశ్రీనివాసులురెడ్డి, గౌడసానివెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా విక్రేతలు అరెస్ట్

గుర్రంకొండ : నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరు విక్రేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ గామిరెడ్డిగారిపల్లెకు చెందిన వెంకటలక్ష్మీ(65) సారా విక్రయిస్తున్న సమాచారం అందుకొన్న పోలీసులు దాడులు నిర్వహించారు, గ్రామంలోని హంద్రీనీవా కాలువ సమీపంలో కలకడ మండలమ దిగువపాళెం తాండాకు చెందిన మూనె నాయక్(48) సారా తీసుకొచ్చి వెంకటలక్ష్మీకి విక్రయించారు. అప్పటికే కొంతమేరకు సారాను విక్రయించేశారు. గ్రామంలో దాడులు నిర్వహించి వారి వద్ద నుంచి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని వారిని అదుపులోకి తీసుకొన్నట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. జరిగిన సంఘటనపై ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఆయన పేర్కొన్నారు.

లక్ష్మీనరసింహుడికి విశేష పూజలు



గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం టీటీడీ ఆధ్వర్యంలో ఆలయంలో విశిష్టమైన పూజలు చేశారు. వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించారు. తోమాల సేవ, ఏకాంత సేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామి వారిని సేవించుకొన్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

గ్యాస్ట్రో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం



హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ పృథ్వీ, అఖిల

మదనపల్లె : పట్టణంలోని సీటీఎం రోడ్డులో పృథ్వీ గ్యాస్ట్రో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభించినట్లు డాక్టర్ పృథ్వీ, అఖిల తెలిపారు. శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ... జిల్లాలో అంతర్జాతీయ ప్రమాణాలు, అధునాతనమైన పరికరాలతో కూడిన గ్యాస్ట్రో లివర్, ఎండోస్కోపి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను మొదటిసారిగా మదనపల్లెలో ప్రారంభించామన్నారు. 24గంటలు అత్యవసర సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.

రహదారి భద్రత మనందరి బాధ్యత



రహదారి భద్రత అవగాహన కార్యక్రమంలో అధికారులు

పీలేరు రూరల్ : రహదారి భద్రత మనందరి బాధ్యత అని ఎంవీఐ టి. విజయకుమారి, సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం ఎంవీఐ కార్యాలయంలో 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా టాక్సీ, ఆటో, ద్విచక్రవాహనాల డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తం 2023లో 699 ప్రమాదాలు జరిగితే 365 మంది చనిపోయారని, 912 మంది క్షతగాత్రులయ్యారన్నారు. అందులో ద్విచక్రవాహన దారులు 212 ప్రమాదాలు జరిగితే 102 మంది చనిపోవడం జరిగిందన్నారు. ఎక్కువగా హెల్మెట్ ధరించని వారు చనిపోయారని తెలిపారు. సినీ హీరోలు, క్రీడాకారులు, రాజకీయ నాయకుల కుమారులు కూడా హెల్మెట్ ధరించకుండా ర్యాష్ డ్రైవింగ్ చేసి మృతి చెందిన సందర్భాలు ఉన్నాయని తెలిపారు. ప్రతి ద్విచక్రవాహన దారుడు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్‌తో మాట్లాడుతూ వాహనాలు నడపరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ డీఈ చంద్రశేఖర్, ఏఎస్ఐ హేమసుందరం, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కలకడ : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం. సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ శ్రీదేవి కోరారు. శనివారం మండలంలోని కదిరాయచెర్వు, నడిమిచెర్ల పంచాయతీలలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం మంజూరు చేసిన నూతన బియ్యం కార్డులు, ఆయుష్మాన్ భారత్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ మనోహర్‌గౌడ్, ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి, ఈఓపీఆర్‌డి లతీఫ్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శి జయచంద్ర, సర్పంచ్‌లు నల్లమ్మ, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

మదనపల్లె : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా శనివారం నక్కలదిన్నె పప్పిరెడ్డిపల్లె పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



ప్రతిజ్ఞ చేపిస్తున్న ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి

కేవీపల్లె : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి అన్నారు. శనివారం వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై మఠంపల్లెలో అవగాహన సమావేశం నిర్వహించారు. మన సంకల్పం అభివృద్ధి చెందిన భారత్ నినాదంతో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

బి.కొత్తకోట : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియపర్చాలనే ఉద్దేశంతోనే భారత వికసిత్ సంకల్ప యాత్ర సాగుతున్నట్లు ఆ కార్యక్రమ నిర్వహణ కోఆర్డినేటర్ మనోహర్‌గౌడ్ అన్నారు. శనివారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ పథకాల గురించి వివరించారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



పీలేరు : నవోదయ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

మదనపల్లె సిటీ : జవహర్ నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్ష శనివారం జరిగింది. ప్రవేశ పరీక్షకు 4789 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 3919 మంది విద్యార్థులు హాజరైనట్లు నవోదయ విద్యాలయ సమితి ప్రిన్సిపాల్ గోవిందరావు తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాతో పాటు అన్నమయ్య జిల్లాలో 26 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో ప్రశాంతంగా పరీక్షలు జరిగినట్లు తెలిపారు. మదనపల్లెలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు కేంద్రాల్లో పరీక్షలు జరిగినట్లు ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పర్యవేక్షించారు.

పీలేరు : నవోదయ ప్రవేశ పరీక్షకు 291 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ వి.జి. నటరాజ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కోటపల్లె బాలుర జెడ్పీ ఉన్నత పాఠశాలలో నవోదయ పరీక్ష నిర్వహించారు. మొత్తం 331 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 40 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. అబ్జర్వర్లు శారద, రమణ పాల్గొన్నారు.

వాల్మీకిపురం : స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నవోదయ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. ఆరవ తరగతి ప్రవేశాలకు 146మందికి గానూ 25మంది గైర్హాజరై 121మంది పరీక్షలు రాసినట్లు ఎంఈవో వెంకటరత్నం తెలిపారు.

తంబళ్లపల్లె : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రాల్లో 6వ తరగతిలో నవోదయ ప్రవేశానికి నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు పరిశీలకులు, ఎంఈవో త్యాగరాజు తెలిపారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో సెంట్రల్ లెవల్ ఆఫీసర్ నాగసుబ్బరాయుడు, ఎగ్జామినర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పరీక్షలు జరిగాయి. 144 మంది విద్యార్థులకు గాను 124 మంది హాజరయ్యారు. మోడల్‌స్కూల్‌లో సెంట్రల్ లెవల్ ఆఫీసర్ బిందు, ఎగ్జామినర్ హేమంత్‌కుమార్‌ల ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు.

22న వరాల ఆంజనేయస్వామి ఆలయంలో

ప్రత్యేక కార్యక్రమాలు

మదనపల్లె : హిందువుల ఆరాధ్యదైవం అయోధ్య శ్రీరాముని విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం సందర్భంగా ఈనెల 22న పట్టణంలోని వరాల ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం ఆలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కమిటీ సభ్యులు మీడియాతో మాట్లాడుతూ అయోధ్యలో శ్రీరాముల వారి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ఉదయం 6 నుంచి 8 గంటల మధ్య సీతా రామ,లక్ష్మణ విగ్రహాలకు పంచామృతాభిషేకం, ఆంజనేయస్వామికి 11 సార్లు మన్యుసూక్త పారాయణ సహిత మధు అభిషేకము, మధ్యాహ్నం 11.30 నుంచి 12.45 వరకు సామూహిక హనుమాన్ చాలీసా, ఆంజనేయ దండకము పారాయణము, స్వామికి మహా మంగళహారతి ఉంటుందన్నారు. మధ్యాహ్నం .3.30 నుంచి 5 గంటల వరకు స్త్రీలకు ముగ్గుల పోటీలు, సాయంత్రం 5.30 నుంచి 6 గంటల వరకు పిల్లలకు సీతా,రామ,లక్ష్మణ, హనుమాన్ వేషధారణ పోటీలు, తదుపరి భరతనాట్య ప్రదర్శన, 7 గంటల నుంచి శ్రీమద్రామాయణము పాత్రధారుల విశ్లేషణ, ధర్మము-ఆచరణపై సంపత్‌కుమార్, రామమూర్తిలచే ప్రవచనాలు ఉంటాయన్నారు.

హార్సిలీహిల్స్ సమస్యలపై ప్రత్యేక దృష్టి

పార్కు, ఇళ్లస్థలాలకు భూమి పరిశీలించిన ఆర్డీఓ మురళి



ప్రభుత్వ భూమి పరిశీలిస్తున్న ఆర్డీఓ మురళి

బి.కొత్తకోట : మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ సమస్యలపై ప్రత్యేక దృష్టితో చర్యలు తీసుకుంటున్నామని టౌన్‌షిప్ కమిటీ చైర్మన్, మదనపల్లె ఆర్డీఓ మురళి అన్నారు. శనివారం కొండపై పర్యటించారు. వివిధ అంశాలపై పరిశీలించాక రెవెన్యూ అతిథిగృహ నిర్మాణ పనులు పర్యవేక్షించారు. కమిటీ సమావేశాల్లో చేసిన తీర్మానాల అమలుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అంతకు ముందు బి.కొత్తకోట నగర పంచాయతీలోని ప్రభుత్వ భూములను పరిశీలించారు. నగర పంచాయతీ కోసం పార్కు ఏర్పాటుకు 8 ఎకరాల భూమి కేటాయింపు కోసం భూమిని పరిశీలించారు. అలాగే ఇళ్లస్థలాల కే టాయించే భూమి, వాటి రికార్డులను పరిశీలించారు. రెండు సర్వే నంబర్ల పరిధిలో ఎన్ని ఎకరాల భూమి ఉందని, వాటి స్థితిగతులను తహసీల్దార్ రఫీక్ అహ్మద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆర్ఐ బాలాజీ, సర్వేయర్ శ్రీవాణీ, వీఆర్ఓ అశోక్, టూరిజం మేనేజర్ సాల్వీన్ రెడ్డి పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యం



విజేతలకు మెమెంటోలు అందిస్తున్న డీపీఓ ధనలక్ష్మి, ఎంపీడీఓ భానుప్రసాద్



క్రీడాకారులను అభినందిస్తున్న ఎంపీడీఓ నారాయణస్వామి

మదనపల్లె : గ్రామస్థాయి నుంచి యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు, వారిలోని క్రీడానైపుణ్యాన్ని గుర్తించేందుకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని డీపీఓ ధనలక్ష్మి అన్నారు. శనివారం ఎంపీడీఓ భానుప్రసాద్ అధ్యక్షతన జెడ్పీహైస్కూల్‌లో జరిగిన ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడాపోటీల ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విజేతలకు మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా డీపీఓ ధనలక్ష్మి మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో విశేష ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి, వారికి అవకాశం కల్పించేందుకు ఆడుదాం ఆంధ్రాపోటీలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ప్రస్తుతం గ్రామ, మండలస్థాయి పోటీలు ముగిశాయని, వీటిలోని విజేతలతో త్వరలో నియోజకవర్గ స్థాయి పోటీలు జరుపుతామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు చిప్పిలి చలపతి, శరత్‌రెడ్డి, వెంకటరమణ, బండిమనోహర్, ఆర్‌బీకే చైర్మన్ కత్తిరాజా, చిప్పిలి యూత్ శశికుమార్, పీఈటీలు దేవకమ్మ, సుధాకర్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లె : ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి క్రీడాపోటీలు శనివారంతో ముగిసినట్లు ఎంపీడీఓ శేషగిరిరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలస్థాయిలో క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ వంటి వివిధ క్రీడాపోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. పురుషుల విభాగంలో పోటీలలో విజేతలుగా క్రికెట్ పోటీల్లో ముష్టూరు, వాలీబాల్‌లో రాచవేటివారిపల్లె, బ్యాడ్మింటన్‌లో నిమ్మనపల్లె-1, కబడ్డీలో నిమ్మనపల్లె-1, ఖోఖో పోటీల్లో కొండయ్యగారిపల్లె సచివాలయాలు నిలిచాయన్నారు. మహిళల విభాగంలో క్రికెట్‌పోటీల్లో రెడ్డివారిపల్లె, వాలీబాల్‌లో ముష్టూరు, బ్యాడ్మింటన్ పోటీల్లో అగ్రహారం, కబడ్డీపోటీల్లో రెడ్డివారిపల్లె, ఖోఖోలో ముష్టూరు సచివాలయాలు విజేతలుగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో పీఈటీలు భద్రయ్య, మణి, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

రామసముద్రం : మండలంలో ప్రశాంతంగా ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ప్రశాంతంగా ముగిశాయి. చెంబకూరు జెడ్పీ హైస్కూల్ క్రీడామైదానంలో వాలీబాల్ పోటీలు, ఆర్.నడింపల్లె పంచాయతీ కాప్పల్లె పంచాయతీ సచివాలయ క్రీడాకారులు మధ్య పోటీ జరిగింది. కాప్పల్లె. ఆర్.నడింపల్లె జట్లు నువ్వా.. నేను అన్నట్లు పోటీ పడ్డారు. చివరకు కాప్పల్లె సచివాలయం వాలీబాల్ జట్టు విజయం సాధించింది.

పెద్దతిప్పసముద్రం : మండల కేంద్రంలో శనివారం జరిగిన మండల స్థాయి క్రికెట్ టీంలో పెద్దతిప్పసముద్రం, తుమ్మరకుంట గ్రామాల క్రీడాకారులు ఫైనల్‌గా నిలిచారు. ఈ మ్యాచ్‌లో తుమ్మరకుంట టీం క్రీడాకారులు ఘన విజయం సాధించారు. సదరు క్రీడాకారులను అభినందిస్తూ జగనన్న ప్రభుత్వం అందజేసిన కిట్లను అందజేశారు.